సాక్షి
సూర్యాపేట
శుక్రవారం ၊ 22 ၊ సెప్టెంబర్ ၊ 2023



42 ఏళ్లుగా గణేశ్ ఉత్సవాలు
నకిరేకల్ మండలం చందుపట్లలో 42 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలను ఐకమత్యంతో నిర్వహిస్తున్నారు.
- 8లో



శోకసంద్రంలో కుర్రంపల్లి
రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురిలో కుర్రంపల్లికి చెందిన ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించారు.
- 8లో



వైభవంగా నిత్యకల్యాణం
మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు.
- 8లో

న్యూస్‌రీల్

పేట మున్సిపాలిటీకి ఇండిగ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు

- నేడు ఆన్‌లైన్‌లో అవార్డు అందుకోనున్న కమిషనర్

సూర్యాపేట: స్థిరమైన పద్ధతిలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించడంతో పాటు ఇటుకలుగా మార్చడంలో సూర్యాపేట మున్సిపాలిటీ చూపిన అంకిత భావం గొప్ప విజయం అని తెలియజేస్తూ ఇండియన్ గ్లోబల్ గవర్నెన్స్ ఇండి గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డును గురువారం ప్రకటించింది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. శుక్రవారం ఆన్‌లైన్ విధానంలో అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి బదిలీ



ఉత్తర్వులు అందుకుంటున్న ఫసియుద్దీన్

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎండి.ఫసియుద్దీన్ పదోన్నతిపై వికారాబాద్ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఉత్తర్వులు జారీ చేయగా ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు చేతుల మీదుగా ఎం.డీ. ఫసియుద్దీన్ పదోన్నతి ఉత్తర్వులను అందుకున్నారు. గ్రేడ్ -2 కార్యదర్శిగా చౌటుప్పల్ మార్కెట్ కార్యదర్శిగా, సూర్యాపేట ఇన్‌చార్జ్‌గా ఇప్పటి వరకు పనిచేయగా గ్రేడ్ -1 కార్యదర్శిగా పదోన్నతి పొందారు.

ఫైలేరియా నివారణకు కృషి చేయాలి



ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు అందజేస్తున్న అధికారి కళ్యాణ్‌చక్రవర్తి

పెన్‌పహాడ్: ఫైలేరియా నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి సూచించారు. గురువారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియాను ప్రాథమిక స్థాయిలో గుర్తించినట్లయితే వాటి నివారణకు కృషి చేయవచ్చన్నారు. ఫైలేరియా 3గ్రేడ్ ఉన్న వారికి కిట్లను అందించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవంతి, ఎంఈఓ రవి పాల్గొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ కమిటీ ఎన్నిక

యాదగిరిగుట్ట: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా 2024–25 నూతన కమిటీని గురువారం యాదగిరిగుట్టలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ బీసీరెడ్డి, టీఎస్ఎస్‌పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ తాడూరి మనోరంజన్‌రెడ్డి, సెక్రటరీ తాజుద్దిన్ బాబా సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఈ.ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీగా రాంరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్, సెక్రటరీగా శ్రీనివాస్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్‌రావు, సెక్రటరీగా నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనరల్ సెక్రటరీ బీసీ రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీ కష్టపడి పని చేసి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు.

ఇళ్ల మధ్య మురుగు

మున్సిపాలిటీల్లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- చెత్త తొలగింపులో సిబ్బంది నిర్లక్ష్యం
- వృద్ధిచెందుతున్న దోమలు
- పట్టింపులేని మున్సిపల్ యంత్రాంగం
- రోగాల పాలవుతున్న ప్రజలు



సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు



మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీ, వీధులు, ఇళ్ల మధ్య చెత్తాచెదారం సరిగ్గా తొలగించడంలేదు. మురుగుకాల్వలను శుభ్రం చేయడంలేదు. దీంతో దోమల బెడద ఎక్కువవుతోంది. మురుగుగుంతల్లో నీరు నిలవ ఉండడంతో పందులు సైతం సంచరిస్తున్నాయి. దోమల నివారణకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నామని మున్సిపల్ అధికారులు రికార్డుల్లో లెక్కలు చూపుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు కన్పించడంలేదు. దోమల కారణంగా ప్రజలు మలేరియా, డెంగీ లాంటి జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని 48 వార్డుల్లో 1.52 లక్షల జనాభా ఉంది. 36,000 నివాసగృహాలు ఉన్నాయి.

- సూర్యాపేట పట్టణంలో ప్రధాన రహదారుల్లోని చెత్త చెదారం తరలిస్తున్నారే తప్ప.. వార్డుల్లోని వీధుల్లో మాత్రం చెత్తను తరలించడంలేదు. దీంతో కాలనీల్లో మురుగు పేరుకుపోతోంది.
- జమ్మిగడ్డ, తాళ్లగడ్డ, అంజనాపురి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సీతారాం పురం, వేంకటేశ్వర కాలనీ, సుందరయ్య నగర్, కొత్త గూడెం బజార్, రాయిన్ని గూడెంలో, పిల్లలమర్రి, దురాజ్‌పల్లిలో నివాస గృహాల మధ్య చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.



సూర్యాపేటలోని తాళ్లగడ్డలో మురుగునీటిలో దోమలు

- దోమల నివారణకు 48 స్ప్రే పంపులు, మూడు ఫాగింగ్‌మిషన్లు అందుబాటులో ఉంచారు.
- వారానికి ఒక సారి, రెండు వారాలకు ఒక సారి ఫాగింగ్ చేస్తున్నారు.
- ఫాగింగ్ చేయడంలేదని ప్రజాప్రతినిధులే ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
- దోమల నివారణకు ఏడాదికి రూ.10 లక్షల పైనే ఖర్చు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.
- గుడ్‌నైట్, ఆలౌట్, జెట్ కాయిల్స్ కోసం పట్టణ ప్రజలంతా కలిసి ప్రతి నెలా రూ.30లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు అంచనా.

ఫాగింగ్ లేదు

కోదాడ: కోదాడ పట్టణ శివారు కాలనీల్లో సరైన డ్రెయినేజీలు లేవు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్చి దోమలు పెరిగిపోతున్నాయి.

- కోదాడ పట్టణంలో ప్రధానంగా భవానీనగర్, నయానగర్, ఎర్రకుంట, రెడ్‌విల్లీ వెనుక, మాతానగర్, సాయికృష్ణ బజార్ వెనుక వీధి, ఖమ్మం క్రాస్‌రోడ్డులో ఇళ్ల మధ్య మురుగు నీటి గుంతలు ఉండడంతో ఇవి దోమలకు నిలయంగా మారాయి.
- శివారు కాలనీలైన ఉత్తమ్ పాద్మావతి నగర్, సర్దార్‌వల్లభాయ్ పటేల్‌నగర్, లక్ష్మీపురం కాలనీ, రాంరెడ్డి పాలెం కాలనీ, సాలార్జంగ్‌పేట కాలనీలలో డ్రెయినేజీలు లేక నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- నయానగర్‌లోని మేకల అభినవ్ వీధిలో బ్రిలియంట్‌స్కూల్ వెనుక మురికి కూపం ఉంది. ఇది దోమలకు నిలయంగా మారింది.
- పోస్టాఫీస్ వెనుక వీధిలో ఇళ్ల మధ్యే మురుగు నీరు నిలుస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అలాగే ఇది పందులకు నిలయంగా మారింది.



సర్దార్ పటేల్‌నగర్‌లో దోమలకు నిలయంగా మారిన మురుగు గుంత

- సీసీరెడ్డి కాన్వెంట్ ఎదురుగా ఉన్న గణేష్‌నగర్, వినాయకనగర్‌లలో మురుగునీరు నిలబడి దోమలు తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయి.
- నాలుగు నెలలుగా కోదాడ పట్టణ పరిధిలో ఒక్కసారి కూడా దోమలమందు పిచికారీ చేయలేదు.
- నాలుగు ఫాగింగ్ మిషన్‌లు ఉండగా వాటిలో ఒక్కటి మాత్రమే పని చేస్తోంది. మూడు మూలన పడ్డాయి.
- నాలుగు నెలల కాలంలో ఒక్క సారి కూడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు.
- మురుగుకాలువల్లో మలాథియాన్ మందు పిచికారీ చేస్తున్నామని మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకుభిన్నంగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

తిరుమలగిరి: మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలతో కలిసి 2018 ఆగస్టు 2వ తేదీన తిరుమలగిరి మున్సిపాలిటీగా ఏర్పడింది.

- తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 4,7,8 వార్డుల్లో డ్రెయినేజీలు లేక రోడ్లు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలుస్తోంది.
- ఆవాస ప్రాంతాలైన అనంతారం, నందపురం, మాలిపురంలో కొన్నిచోట్ల డ్రెయినేజీ సరిగా లేదు. ఇక్కడ 15 రోజులకు ఒకసారి కూడా మురుగు కాల్వలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేయడంలేదు.
- పట్టణ మంతా పందులు సంచరిస్తున్నాయి.
- పట్టణంలోని 1,2,9,10 వార్డుల్లో ఖాళీ ప్లాట్లలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయి. మురుగు నీరు నిల్చిన చోట దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పందులు సంచరిస్తున్నాయి.
- ఖాళీ ప్లాట్లలో మురుగు, వర్షం నీరు నిల్చి మురుగు గుంతలుగా మారుతున్నాయి.



తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ ప్రదేశంలో నిలిచిన మురుగు నీరు.

“ పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం



పందులు ఎక్కడ పడితే అక్కడ తిరుగుతున్నాయి. వరి నార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి. పందులు నిర్మూలించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.
–అశోక్‌రెడ్డి, తిరుమలహిల్స్, తిరుమలగిరి

“ అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



తిరుమలగిరి కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడినా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొన్ని చోట్ల దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాకాలంలో ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరు నిలిచి దోమల బెడద అధికమయింది. దోమలతో ప్రజలు విష జ్వరాలకు లోనవుతున్నారు.
– కడెం లింగయ్య, సీపీఎం నాయకుడు

కొండా లక్ష్మణ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



సూర్యాపేటలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర భావితరాలకు తెలిసేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చలమళ్ల నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని ఎంజీరోడ్డులో గల మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1969లో తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేశారని, 95 ఏళ్ల వయస్సులోనూ మలిదశ ఉద్యమంలో భాగంగా ఢిల్లీలో నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు. తన ఇంటిని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి ఇచ్చి ఉద్యమానికి ఊపిరి పోశారని, తన చివరిశ్వాస వరకు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారని వివరించారు. చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు ఎనలేని కృషి చేశారని చెప్పారు. సూర్యాపేటలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల గోపాలకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి యలగందుల సుదర్శన్, జిల్లా కార్యదర్శి దులం నగేష్, జిల్లా యూత్ అధ్యక్షుడు యుగంధర్, పున్న వెంకన్న, నాయకులు చిలువేరు నరసింహారావు, రామనాథం, పొపని యాదగిరి, వెంకటేశ్వర్లు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, జగన్నాథం, ఆంజనేయులు, మార్కండేయ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులన్నీ తక్షణమే పూర్తి చేయాలి

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పెండింగ్‌లో ఉన్న కలెక్టరేట్ పనులతో పాటు అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచించారు. గురువారం రాత్రి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలాన్ని తక్షణమే అరులైన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆర్అండ్‌బీ చేపట్టిన భవన నిర్మాణ పనులు, రహదారుల పెండింగ్ పనులను త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయాలని కోరారు. జీఓ59కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి పట్టాలు అందజేయాలన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో సీసీ రహదారుల ఆధునీకరణ పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు, అన్ని ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి



మునగాల: గణపవరం శివారులో డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్

మునగాల: జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. గురువారం మునగాల మండలంలోని మాధవరం, గణపవరం, మునగాలలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఆయిల్ పామ్ సాగు విధానం, ప్రభుత్వ సబ్సిడీ, అంతర పంటల సాగు అంశాలపై సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది 10,500ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 2,100ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు ముందుకు వచ్చారన్నారు. అలాగే 1,100కు పైగా మొక్కలు నాటారని, మిగిలిన రైతులకు కూడా ఈనెలలో మొక్కలు అందించనున్నట్లు తెలిపారు. మాధవరంలో రైతు బండి రమేష్‌తో పాటు మరికొంత మంది రైతులు డ్రిప్ ద్వారా సాగు చేస్తున్న ఆయిల్ పామ్‌తోటను పరిశీలించి సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. గణపవరంలో కేతిరెడ్డి వెంకటరెడ్డి , మునగాల శివారులో ఐఏఎస్ మాజీ అధికారి ఎంవీరెడ్డి సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను ఆయన పరిశీలించారు. పంట మార్పిడి విధానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో రైతు తిమ్మారెడ్డి రాఘవరెడ్డి డ్రమ్ సీడర్‌తో సాగు చేసిన ఐదు ఎకరాల వరిపైరును ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలో గల శ్రీకనకదుర్గ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని డీలర్‌ను కోరారు. రైతులకు ఎమ్మార్పీకే ఎరువులను అందజేయాలని ఆదేశించారు. స్థానిక సివిల్ ఆసుపత్రి ఎదురుగా అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని మండలానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు ఓ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందచేశారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయిక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ పథకం ఏపీఓ శైలజ, మండల ఆర్ఐ రాధారెడ్డి ఉన్నారు.

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



ఢిల్లీలో ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేషురెడ్డి

పాలకవీడు: పాలకవీడు మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తీగల శేషురెడ్డి గురువారం ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలతో కలిసి నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యుడు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో తరచూ నెలకొన్న వివాదాలు, విభేదాలు, ఆధిపత్య పోరు తదితర కారణాలతో సహనం కోల్పోయి పార్టీ మారినట్లు శేషురెడ్డి తెలిపాడు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ: ఎస్సీ వర్గీకరణకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీస్ నాయకులు గురువారం విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై కోదాడ బైపాస్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగ ఉపకులాలకు భవిష్యత్తు ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్లయినా నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. పట్టణ పోలీసులు రాస్తారోకో చేస్తున్నవారిని అదుపులోకి తీసుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో ఏపూరిరాజు, వడ్డేపల్లి కోటేష్, యలమర్తిరాము, గంధం కోటయ్య, మల్లెపంగు సూర్య, సత్యరాజు, నవీన్‌కుమార్, దున్నా వంశీ, బచ్చలకూరి వెంకన్న పాల్గొన్నారు.

మహిళల్లో అన్ని వర్గాలకు కోటా కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు కోటా కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత సత్యనారాయణపిళ్లై కోరారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు కోటా కల్పించాలని కోరుతూ గురువారం సూర్యాపేటలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద తెలంగాణ బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 ఏళ్ల తర్వాత మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కంచుకొమ్ముల వెంకట్, నాయకులు బుద్ధ సత్యనారాయణ, చామకూరి నరసయ్య, పద్మ, వెంకటమ్మ, నిర్మల, సైదమ్మ, నాగమ్మ, అనసూయ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 89789 63674

క్లుప్తంగా

మోటార్ వెహికల్ యాక్ట్ కింద రెండేళ్ల జైలు

డిండి: మోటార్ వెహికల్ యాక్ట్ కింద ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు గురువారం తీర్పు వెల్లడించారు. డిండి మండల పరిధిలోని టి.గౌరారం గ్రామానికి చెందిన ఇరిగదిండ్ల రవీందర్, పేర్ల కృష్ణయ్య ఇద్దరు స్నేహితులు. పేర్ల కృష్ణయ్యకు చెందిన ట్రాక్టర్‌పై స్థంబాల చెరువులో మట్టిని తోలుకుని బయటకు తీసుకు వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌పై కూర్చున్న రవీందర్ మార్గమధ్యంలో కిందపడిపోయాడు. దీంతో రవీందర్ తల పైనుంచి ట్రాక్టర్ వెనుక టైర్ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో రవీందర్, కృష్ణయ్యకు మధ్య వ్యవసాయ బోరు మోటార్ విషయంలో గొడవ ఉందని, అది మనసులో ఉంచుకొని తన తండ్రి రవీందర్‌ను పేర్ల కృష్ణయ్య హత్య చేశాడని ఆరోపిస్తూ 2017 డిసెంబర్ 24న మృతుడి కుమారుడు ఇరిగదిండ్ల వేణు డిండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ పీఎన్‌డీ ప్రసాద్ కేసు నమోదు చేసి పేర్ల కృష్ణయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. గురువారం కేసు తుది విచారణకు రాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శ్రీవాణి, ఎడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మోటార్ వెహికల్ యాక్ట్ 304 పార్ట్ 2 కింద పేర్ల కృష్ణయ్యకు రెండు సంవత్సరాల జైలు, రూ.వేయి జరిమానా, అదేవిధంగా మోటార్ వెహికల్ యాక్ట్ 181 కింద రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

గడ్డిమందు తాగి చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

మాడుగులపల్లి: కుటుంబ సభ్యులు మందలించారనే కోపంతో గడ్డి మందు తాగిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన బొబ్బలి సైదులు-నిర్మల దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె రమ్య(20) నల్లగొండలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. అయితే చదువుకోకుండా తరచూ సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తోందని ఈ నెల 18న కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనవేదనకు గురైన రమ్య మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందింది. తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

చుక్క యాకమ్మకు నాయకుల నివాళి



పాడెమోస్తున్న మందుల సామేల్

అడ్డగూడూరు: మండలంలోని బొడ్డుగూడెం శివారులో జరిగిన ఆర్టీసీ బస్సు బోల్తా ఘటనలో మృతిచెందిన అడ్డగూడూరు మండలం చిన్న పడిశాలకు చెందిన చుక్క యాకమ్మ(50) అంత్యక్రియలు గురువారం గ్రామంలో నిర్వహించారు. ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకుడు చిరంజీవి, అన్నెపు జ్ఞానసుందర్, ఏపూరి సోమన్న, మాజీ గిడ్డంగుల చైర్మన్ మందుల సామేల్ నివాళులర్పించారు.

42 ఏళ్లుగా గణేశ్ ఉత్సవాలు



చందుపట్లలో గణనాథుడి విగ్రహం వద్ద యువజన మండలి సభ్యులు

- చందుపట్లలో అన్నదానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామంలో 42 ఏళ్లుగా వివేకానంద యువజన మండలి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1983లో గ్రామంలోని కొంతమంది యువకులు వివేకానంద యువజన మండలి ఏర్పాటు చేసి, సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. యువజన మండలి ఏర్పాటుకు రెండేళ్ల ముందు నుంచి గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది పంచాయతీ సమీపంలో వినాయక చవితి ఉత్సవాలు జరిపిస్తున్నారు. అదేవిధంగా భక్తులకు అన్నదానం చేస్తూ రాత్రి వేళల్లో మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. దీంతోపాటు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు సైతం 20ఏళ్లుగా కలిసికట్టుగా నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం



మాగ్రామంలో యువకులు, పెద్దల సహకారంతో ప్రతి ఏడాది యువజన మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు అన్నదానం చేయడంతోపాటు రాత్రి వేళల్లో మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. ఉత్సవాలకు మా యువజన మండలి పూర్వ సభ్యులతో పాటు, ప్రస్తుత సభ్యుల సహకారంతో అనేక కార్యక్రమాలను చేపడుతున్నాం.

– పుట్ట రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

1962లో యాదగిరిగుట్టలో మొదటిసారిగా..



వినాయకుడికి పూజలు చేస్తున్న నిర్వాహకులు

యాదగిరిగుట్ట: పట్టణంలోని గాంధీనగర్‌కు వెళ్లే దారిలోని వైకుంఠద్వారం సమీపంలో గల హనుమాన్ ఆలయంలో గత నలభై ఏళ్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా కాలనీలో ఉండే ప్రజలంతా కమిటీగా ఏర్పడి నవరాత్రులను వైభవంగా జరిపిస్తున్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోనే మొట్టమొదటిసారిగా హనుమాన్ ఆలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలకు దొమ్మాట యాదగిరిరెడ్డి, గౌళికార్ కిషన్‌రావు, యాదిలాల్, కైరంకొండ యాదగిరి తదితరులు శ్రీకారం చుట్టారు. 1962 సంవత్సరానికి ముందే నాలుగైదు కుటుంబాలు మండపాన్ని ఏర్పాటు చేసి అప్పట్లో సుమారు 3ఫీట్ల వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సుమారు 4 నుంచి 5 ఫీట్ల ఎత్తు ఉన్న వినాయకుడి విగ్రహాన్ని తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తున్నారు.

పదేళ్లప్పటి నుంచి పూజలు..



నేను పదేళ్ల ఉన్నప్పటి నుంచి హనుమాన్ ఆలయం వద్ద వినాయక మండపం వద్ద పూజలు చేస్తున్నాను. ప్రస్తుతం నాకు 45 సంవత్సరాలు. ఇంటి చుట్టుపక్కల ప్రజలంతా కమిటీగా ఏర్పడి పూజలు జరిపిస్తున్నాం. మా పెద్దలు ఏ విధంగానైతే పూజల బాధ్యత మా పై పెట్టారో.. అలాగే మా పిల్లలకు నేర్పిస్తున్నాం.

– డి. శ్రీధర్‌రెడ్డి, నిర్వాహకుడు

శోకసంద్రంలో కుర్రంపల్లి

- ముగిసిన మల్లిఖార్జున్, మణిపాల్‌ల అంత్యక్రియలు



రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

చింతపల్లి: చింతపల్లి మండలంలోని నసర్లపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురిలో కుర్రంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మల్లిఖార్జున్, మణిపాల్‌ల అంత్యక్రియలు గురువారం గ్రామంలో నిర్వహించారు. దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో వీరి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మల్లిఖార్జున్, మణిపాల్‌లు ఇరువురు స్నేహితులు కావడం, 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒకే పాఠశాలలో విద్యనభ్యసించడంతో పాటు ఇరువురి ఇళ్లు పక్కపక్కనే ఉండడంతో వీరి బంధం విడదీయరానిది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వందల సంఖ్యలో గ్రామస్తులు తరలిరావడంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. వీరి మృతదేహాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. వివిధ పార్టీల నాయకులు, స్థానిక నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అక్కంపల్లిలో ప్రసాద్, రమణ, అవినాష్‌కు తుది వీడ్కోలు..



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని మద్దిమడుగు ప్రసాద్-రమణ దంపతులు, వారి పెద్దకుమారుడు అవినాష్‌లు చింతపల్లి మండలంలోని నసర్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి అంత్యక్రియలు గురువారం స్వగ్రామమైన అక్కంపల్లిలో నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు తోడపుట్టిన వాడు సైతం మృత్యువాత పడటంతో ప్రసాద్-రమణ దంపతుల చిన్న కుమారుడు అఖిల్ ఒంటరిగా మిగిలాడు. అతడి నాయనమ్మ నర్సమ్మ అఖిల్‌ను పట్టుకొని రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్తులు, బంధువులు కోరుతున్నారు.

ప్రమాద ఘటన కారణాలపై పోలీసుల ఆరా



నసర్లపల్లిలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర రోడ్డు సేఫ్టీ వింగ్ ఎస్పీ రాఘవేందర్‌రెడ్డి

చింతపల్లి: మండలంలోని నసర్లపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని రాష్ట్ర రోడ్డు సేఫ్టీ వింగ్ ఎస్పీ రాఘవేందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు, అందుకు గల కారణాలను ఆర్‌అండ్‌బీ, పోలీసు శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద వివరాలను దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు. ఈసందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులకు పలు సూచనలు చేశారు. మూలమలుపుల వద్ద వేగ నియంత్రణ, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్– నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి మండల పరిధిలో మాల్ వెంకటేశ్వరనగర్ నుంచి నాగార్జునసాగర్ వరకు నల్లగొండ జిల్లా పరిధిలో 81 కి.మీ. విస్తరించి ఉందని, ఈ రహదారిలో తప్పనిసరిగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు మూలమలుపుల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అదేవిధంగా చింతపల్లి మండలంలోని నసర్లపల్లి, వెంకటంపేట, మదనాపురం, వింజమూరు, కుర్మేడు, విరాట్‌నగర్ కాలనీల్లో మూలమలుపులను పరిశీలించారు. ఆయన వెంట దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, రాష్ట్ర రోడ్డు సేఫ్టీ డీఎస్పీ వాహెబ్, నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ ఖాజన్‌గౌడ్, ఆర్‌అండ్‌బీ ఏఈ మహమూద్, ఏడబ్ల్యూ ఈఈ షరీఫ్, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, తహసీల్దార్ శంషొద్దీన్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బ్రెయిన్ డెడ్

- అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులు



శ్రీశైలం (ఫైల్)

చింతపల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తికి బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబసభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకువచ్చారు. వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన సన్నాయిల శ్రీశైలంయాదవ్ (40) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18న రాత్రి నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజుల పాటు వైద్యం అందించారు. గురువారం బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. జీవదాన్ సంస్థకు కిడ్నీలు, కళ్లు, లివర్‌ను దానం చేశారు. కాగా.. మృతుడికి భార్య సంతోష, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణం

కొండమల్లేపల్లి: వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. కొండమల్లేపల్లి, హుజూర్‌నగర్, ఆత్మకూరు మండలాల పరిధిలో చోటుచేసుకున్న ఘటనల వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో నివాసముంటున్న రమావత్ హతీరాం, పద్మ దంపతుల కుమారుడు జగన్‌కు ఏడాదిన్నర క్రితం పీఏపల్లి మండలం బాలాజీనగర్ గ్రామానికి చెందిన అంజలితో వివాహమైంది. అంజలి తల్లిదండ్రులు జీవనోపాధి నిమిత్తం పల్నాడు జిల్లాలోని మాచవరం మండల పరిధిలోని పిన్నెల్లి గ్రామంలో ఉంటున్నారు. జగన్, అంజలి దంపతులకు నాలుగు నెలల పాప ఉంది. కొద్ది రోజులుగా అంజలి అత్తమామలతో తగాదా పడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం భర్త జగన్ పనినిమిత్తం వేరే ఊరికి వెళ్లగా అంజలి తన పాపను ఆడపడుచు వద్ద ఉంచి తన గదికి వెళ్లింది. సాయంత్రం వరకు అంజలి బయటికి రాకపోవడంతో అత్త లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా తన కుమార్తె అనారోగ్య సమస్యలతోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని, తన కుమార్తె ఆత్మహత్యతో ఆమె అత్తమామలకు, తమకు సంబంధం లేదని మృతురాలి తల్లి దస్లీ పేర్కొంది.

మద్యానికి డబ్బులు ఇవ్వనందుకు..



గోపాలకృష్ణ (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలో ఓ యువకుడు ఉరేసుకుని మృతి చెందాడు. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన అనంత రామమ్మ, కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన రాధాకృష్ణకు 24 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు గోపాలకృష్ణ ఉన్నాడు. అనంత రామమ్మ, రాధాకృష్ణ కొంతకాలంగా విడిగా ఉంటున్నారు. తల్లి అనంత రామమ్మ, కుమారుడితో కలిసి తన పుట్టింట్లో ఉంటుంది. కొంతకాలంగా గోపాలకృష్ణ(22) చెడు వ్యసనాలకు బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. మద్యానికి డబ్బులు కావాలని తల్లిని అడగగా ఆమె ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన గోపాలకృష్ణ బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి అనంత రామమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురువారం తెలిపారు.

కుమారులు తన వద్ద లేరని మనస్తాపానికి గురైన మహిళ..

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లేటి మంజుల(35) జగద్గిరిగుట్టకు చెందిన వ్యక్తితో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. 15 సంవత్సరాల క్రితం భర్త మృతి చెందాడు. అప్పటి నుంచి మంజుల మండల కేంద్రంలో తల్లి అండమ్మ ఇంటి వద్దే ఉంటుంది. కుమారులు ఇద్దరూ జగద్గిరిగుట్టలో తాత, నానమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. భర్త మరణం, కుమారులు తన వద్ద లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగింది. అదే సమయంలో వచ్చిన తల్లి అండమ్మ చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం గురువారం ఆత్మకూరు(ఎం)లో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి తల్లి అండమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఇడికూడలో సృజనమణి అంత్యక్రియలు



పాల్వాయి స్రవంతిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సతీమణి పాల్వాయి సృజనమణి (77) అంత్యక్రియలు గురువారం వారి స్వగ్రామమైన చండూరు మండలం ఇడికూడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో జరిగాయి. ఆమె పార్థివదేహానికి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చలమల్ల కష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, పాల్వాయి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- 20 తులాల బంగారు ఆభరణాలు, కేజీ వెండి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు చూపుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై సమీపంలోని మాన్నాడికి చెందిన ఇమ్రాన్ ఖాన్ ఓ హోటల్‌లో మేనేజర్‌గా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదేవిధంగా మిర్యాలగూడెం పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన సూర్య క్యాటరింగ్ పని చేయడంతోపాటు, సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా చేస్తూ చెన్నైలో నివాసం ఉంటున్నాడు. అక్కడ హోటల్‌లో పని చేస్తున్న క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి చోరీలకు పాల్పడ్డారు. 2022లో చెన్నైలో రెండు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చారు. చెన్నైలో చోరీలు చేస్తే దొరికిపోతామని చౌటుప్పల్, అబ్దులాపూర్‌మెట్, నార్కట్‌పల్లి, నకిరేకల్, నల్లగొండలోని చోరీలు చేయడం ప్రారంభించారు. ముశంపల్లి రోడ్డులోని న్యూసాయినగర్‌లో ఉన్న ఎన్జీ కళాశాల లెక్చరర్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇంటిలో ఈనెల 9న 6తులాల బంగారం, 60 తులాల వెండి ల్యాప్‌టాప్‌లు, రూ.5వేల నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై శ్రీనివాస్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో నల్లగొండలోని పాతబస్తీలో సిమెంట్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరినీ పట్టుకుని విచారించగా నేరం అంగీకరించారు. కేసు ఛేదించిన డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, లింగారెడ్డి, పుష్పగిరి, ఇమ్రాన్ ఖాన్, నరేష్‌లను ఎస్పీ అభినందించారు.


వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, గర్భాలయంలోని శ్రీమూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామిఅమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవం నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వంగపల్లి వైకుంఠధామంలో చోరీ

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి గ్రామ వైకుంఠధామంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామపరిధిలో పల్లెప్రగతిలో భాగంగా నూతనంగా వైకుంఠధామాన్ని నిర్మించారు. ఈ వైకుంఠధామంలో ప్రజల అవసరాలకు ఏర్పాటు చేసిన 30వాటర్ నల్లాలు, 20వాటర్ షవర్‌లు, ఓ బోర్ మోటార్ వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వాటి విలువ సుమారుగా రూ.30వేల వరకు ఉంటుందని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ కానుగు కవిత బాలరాజ్‌గౌడ్, ఉపసర్పంచ్ రేపాక స్వామి, ఎంపీటీసీ రేపాక మౌనిక మహేందర్ తెలిపారు.

కుక్కలదాడిలో పలువురికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన బాధితులు

నూతనకల్ : పిచ్చికుక్కలు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిత్తలూరి సుభద్ర, పులి ఎల్లమ్మ, ఉప్పమ్మ, సోమయ్య, కౌసల్య, గడ్డం వజ్రమ్మ, ముత్తమ్మతో పాటు పలువురిపై వీధికుక్కలు ఆకస్మాతుగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మృతికి కారణమైన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వలిగొండ : ద్విచక్రవాహనం అజాగ్రత్తగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదుళ్లగూడెం గ్రామానికి చెందిన మునుకుంట్ల బాలకొట్టి (50) అదే గ్రామానికి చెందిన మునుకుంట్ల మల్లేష్‌తో కలిసి రోడ్డు వెంట సైకిల్‌ను నడిపించుకుంటూ వలిగొండ నుంచి ఏదుళ్లగూడెం తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో నాతాళ్లగూడెం – మాందాపురం గ్రామాల సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న సోమనబోయిన బలరాం మునుకుంట్ల బాలకొట్టిని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో బాలకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం రాత్రి మృతి చెందాడు. దీంతో అజాగ్రత్తగా ద్విచక్రవాహనం నడిపి బాలకొట్టి మృతికి కారణమైన బలరాంపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సూర్యాపేట క్రైం : అక్రమంగా డీసీఎం వాహనంలో తరలిస్తున్న 14టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని పాల్కోనిగుంట తండాకు చెందిన రత్నావత్ గోపాల్, అతడి తమ్ముడు గణేష్ ఆయా గ్రామాల్లో తక్కువ ధరకు సేకరించిన 14టన్నుల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్ చుట్టుపక్కల గల రైస్‌మిల్లుల్లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు డీసీఎం వాహనంలో తరలిస్తుండగా సూర్యాపేట పట్టణంలోని జనగాం క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బియ్యంతో పట్టుబడ్డారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ వై.సైదులు తెలిపారు.

'నారీ సాహిత్య భేరీ'కి అర్చనాదేవికి ఆహ్వానం



శ్రీపాద అర్చనాదేవి

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన శ్రీపాద అర్చనాదేవికి తానా అంతర్జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న నిర్వహించే నారీ – సాహిత్య భేరి అనే సాహిత్య కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం ఆమె స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో 14గంటల పాటు నిర్విరామంగా ఆన్‌లైన్‌లో జరిగే ఈ సాహిత్య సమ్మేళనంలో భారత్‌తో పాటు సుమారు 15దేశాలకు చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రులు, రచయితలు పాల్గొంటారని తెలిపారు. తెలుగు– వెలుగు సాహిత్య వేదిక తరుపున తనను ప్రతిపాదించిన వారికి, పాల్గొనే అవకాశం కల్పించిన వారికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో ఇటీవల గాయపడిన ఓ వానరం బుధవారం రాత్రి మృతి చెందింది. దీంతో గ్రామపంచాయతీ కార్మికులు గురువారం వానరానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. వానరం చనిపోయి కుక్కలు లాక్కెళ్తుండగా గమనించిన గ్రామస్తులు పంచాయతీ కార్మికులకు సమాచారం ఇవ్వడంతో వానరాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.